

# హాయ్! అన్నీ! ప్రేమిస్తావా?

కె.వి.యస్.శర్మ

* మనవి: అ, ఆ అన్నవి ఇంగ్లీషులో A లాగా ఉచ్చరించాలి. ఉదాహరణకి లాబ్ అన్నది ఇంగ్లీషులో lab లాగాను రాట్ అన్నది Rat లాగాను ఉచ్చరించాలి. అల్లాగే అండ్ అన్నది And లాగాను అపెక్స్ Appex లాగాను పలకాలి. అంటే తెలుగు భాషకి మరో అక్షరం (శబ్దం?) జేర్చమని మనవి.

భూమ్మీదింకా ప్రేమించటం ప్రేమించబడటం గౌరవనీయులు చేయాల్సిన పనులు కావని నమ్మేవారున్నారంటే మీరు నమ్మరని తెలుసును. మామూలుగా అయితే నేనూ నమ్మను. కాని ఇది నేను పి. హెచ్. డి. చేస్తున్న ఇంస్టిట్యూట్ లోనే జరగటంచేత, రిసెర్చి మానుకుని అనువ్రతులు పట్టుకుపోయింది నాతో చిన్నప్పటినుంచి చదువుకున్న నరసింహారావే అవటంచేత నాకు నమ్మక తప్పలేదు. నరసింహారావుకి అల్లా అవాల్సిందే అనుకున్న వాళ్ళు లేకపోలేదు. కాని వాళ్ళలో రమ ఉమ లేరు. నిజానికి రవుడీ అబ్బాయి అన్న పేరు నరసింహారావుకి పెట్టి, అది మా పాత యూనివర్సిటీ నుంచి ప్రస్తుతపు ఇంస్టిట్యూట్ వరకు మోసుకు వచ్చింది వాళ్ళే. వాళ్ళలా అనుకోడంలో తప్పులేదు. నరసింహారావు రమని ఉమని విద్యార్థి దశలో అల్లరిపెట్టిన మాట నిజమే. కాని వాళ్ళుకూడా కాస్త పెంకి ఘటాలు. అతను నిజంగా, ఎప్పుడూ భూమికేసే చూస్తూ భూమ్మీదే నడిచే సీతాలక్ష్మల్ని అల్లరిపెట్టలేదు. అయితే రమ ఉమ చెప్పింది విని సీతాలక్ష్మలు, అనసూయా అరుంధతులు నమ్మటంతో అతనికి రవుడీ అబ్బాయనే పేరు స్థిరపడింది. అల్లాగే అతను యూనివర్సిటీ వదిలి మరో ఇంస్టిట్యూట్‌కి రిసెర్చి కోసం పోతుంటే ఏ పాత మేష్టర్లు ఆనంద భాష్పాలు రాల్చారు. వాళ్ల స్టూడెంటు అభివృద్ధిలోకి వచ్చాడనికాదు. వాళ్ళని వదిలిపెట్టి పైకి పోతున్నాడని. నరసింహారావుకున్న రెండో దుర్గుణం అతను న్యాయంకోసం అవుసరమైతే మేష్టర్లని ఎదిరించటం.

ఇల్లాంటి దుర్గుణాలపుట్టకి స్పందించగల హృదయం వుండటం సావిత్రి కో పెద్ద నేరంలా కన్పించటంలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే సావిత్రికి హృదయం స్పందించటానికి ముందు హృదయం వుండాలని తెలియదు. ఆలోచన అంటూ చెయ్యగలిగినవాడికే తప్ప ఆలోచనలు వస్తాయని రిసెర్చిచేసే వాళ్ళందరికీ తెలుసు. అల్లాగే హృదయం అంటూ వున్నవాళ్ళకే హృదయ స్పందనలంటూ వుంటాయని

'ప్రేమించేవాళ్ళందరికి తెలుసు. నేను వరలక్ష్మిని ప్రేమించాను. అందుకనే నాకు నరసింహారావంటే సానుభూతి.

నరసింహారావు దగ్గరున్నది అతను ఇంకొకళ్ళ దగ్గరనుంచి దొంగతనంగా ఎత్తుకొచ్చిన హృదయం కాదు. కేవలం అతనిదే. అతని స్వంతం. పోనీ అతని దగ్గరున్నది సావిత్రిదై వుంటే నేరమే. కాని సావిత్రి తనది తనదగ్గరే భద్రంగా దాచుకుంది కదా! మరి నేరమైన విషయం ఏమిటి? అతని హృదయం, ఏ హృదయం అయితే రిసెర్చి పేరుతో జరిగే అన్యాయాలకి కూడా చెక్కుచెదర లేదో ఆ హృదయం, సావిత్రిని చూసి విలవిల లాడిపోవటం. ప్రేమే నేరమౌనా? అంటూ పాట పాడకండి. మా ఇన్‌స్టిట్యూట్‌లో అది నేరమే! మరి నేనెల్లా ప్రేమించానంటారా? వరలక్ష్మి మా బళ్ళో లేదు. విశాఖపట్నంలో మా ఇంటిపక్క నుంది. తన్నే ఎల్లాగో మా అమ్మా నాన్నా కట్నం కానుకలతో స్థిరపరిచారు కనుక ప్రేమించటం మొదలుపెట్టాను. రేపో మాపో నాకు పి. హెచ్. డి. వస్తే మా పెళ్ళయిపోతుంది. అందుకని పెళ్ళయ్యేవరకు కాలం వృధాపోకుండా సెలవల కింటికి వెళ్ళినప్పుడు యుగళ గీతాలు పాడుకుంటూ, దూరంగ వున్నప్పుడు ప్రేమ లేఖలు వ్రాసుకుంటూ ఉన్నంతలో మా నాన్నగారు ఒప్పుకున్నంత జాగాలోనే నా ప్రేమ సౌధానికి పునాదులు వేసుకుంటు న్నాను.

హాస్టల్లో నా రూములోనే వున్న నరసింహరావుకి శనివారం రాత్రి మొదలు పెట్టి సోమవారం పొద్దున్నకి పూర్తిచేసే సువాసన నీలిరంగు కాగితాల వుత్తరాల పైనం తెలియకుండా, బఠానీ గింజలలాంటి అక్షరాల వుత్తరాలు, చిరునవ్వులు నవ్వు కుంటూ నేను చదువుకోటం కనిపించ కుండా ఎల్లావుంటాయి. దీనివల్ల కొంత డిమాన్‌స్ట్రేషన్ ఎఫెక్టు నరసింహారావు మీద వుండివుంటుంది. లేకపోయినా ప్రేమ విషయంలో నరసింహారావు స్వయం శక్తి సంపన్నుడు ఉన్నట్టుండి ఉగాది తరువాత నరసింహారావు ప్రతిరోజు తెల్లబట్టల్లో మెరిసిపోవటం మొదలుపెట్టాడు. ముందర అది నరసింహారావు కొత్త సంవత్సరపు తీర్మానమేమో అని కొన్నాళ్ళు నిర్లక్ష్యం చేసాను. కాని ఉగాది వెళ్ళి నెలైనా కూడా నరసింహారావు ప్రవర్తనలో మార్పులేదు. ఎప్పుడు ఏమవుసరం వస్తుందో అన్నట్టు, ఎప్పుడూ పువ్వులా వుండటం నాకాశ్చర్యం కలిగించింది. నాకతను తెలిసిన పది సంవత్సరాలలో ఏ సంవత్సరంకూడా అతను ఉగాది తీర్మానాల కన్నిరోజులు అతుక్కుని వుండటం చూడలేదు. అందుచేత ఇది అది కాదు, వేరొకటి, అని పోల్చుకున్నాను.

నరసింహారావులో మార్పుకి కారణమైన చిన్నదెవరా అని జాగ్రత్తగా కనిపెట్టాను. మెస్సులో, లైబ్రెరీలో, కాఫీ క్లబ్బులో ఎక్కువగా ఎవరు వచ్చేవేళకి నరసింహారావు నన్ను లాక్కెడుతున్నాడో గమనించాను. వారం రోజులయ్యేసరికి ఆ చిన్నది అన్‌సావిత్రని పోల్చుకున్నాను. (*) అన్ అంటే ఏమిటో నాకు తెలియదు. అందరు అనేది సతీ సావిత్రి అని. ఆ బాలిక, పెళ్ళి కాకపోయినా పతివ్రతన్న పేరు తెచ్చుకుంది. ఆ సాధ్వి పురుషులకేసి కన్నెత్తి కూడా చూడదు తన రిసెర్చి ఏమిటో తనేమిటోలా వుంటుంది. పైగా ఆ అమ్మాయి నరసింహారావు గురించి రమ, ఉమలు చెప్పే కథలు విని వుంటుందనుకుంటాను. నరసింహారావు దారిలో ఎదురైతే, అతనిటు నడుస్తూవుంటే సావిత్రి అటు పారిపోయేది. మెస్సులో నరసింహారావు పక్కన కూర్చోవల్సివస్తే, చేతివాటుదూరంలో వుండకుండా రెండు కుర్చీలు ఖాళీగా వదిలేసి మరీ కూర్చునేది. నాకీ వ్యవహారం నచ్చక 'నరసింహారావు! నీకింక ఎవరూ దొరక లేదా!' అని అడిగానోసారి. దాని కతను సావిత్రివంటి పతివ్రతకి పతి కాగల గటం కంటే అదృష్టం వేరొకటి లేదని, రేపు సావిత్రి కనుక అతని పెళ్ళాం అయితే, ఆమె మరొకడికేసి కన్నెత్తి కూడా చూడదు కనుక ఆదివారంకూడా ధైర్యంగా లాబ్‌కెళ్ళి రిసెర్చి చేసుకోవచ్చునని చెప్పి ఆపైన నవ్వాడు. ఆ నవ్వులో ప్రేమించిన వాడిని ఎందుకు ప్రేమించా వబ్బాయి అని అడక్కూడదని, మళ్ళీ మాట్లాడితే ప్రేమించిన చిన్నదాని లోపాలనికూడా సుగుణాలగా వర్ణించగల నేర్పు ప్రేమించిన చిన్నవాడి కుంటుందని అర్థాలున్నాయి.

నరసింహారావు బొక్కులా దూసుకు పోగలడు. చాలా చొరవగలవాడు కనుక త్వరలోనే సావిత్రితో పరిచయం చేసేసు కుంటాడని అనుకున్నాను. ఎందుకంటే అతనెవరైనా సరే 'ఏమండి విహారి రాజమండ్రికదూ మీగురించి సుబ్బారావు చెపుతూ వుండేవాడు' అంటూ నిలబెట్టి పలకరించగల ధీరుడు. అయితే చిత్రంగా నెలరోజులైనా పరిస్థితుల్లో మార్పులేదు. అంటే నరసింహారావు ప్రేమ విషయంలో కాదు. అది విశాఖపట్నం పెరిగినట్టు ఉధృతంగా పెరిగి పోయిందికాని పరిచయం మాత్రం విశాఖపట్నపు రోడ్ల పరిస్థితి మెరుగుపడనట్టు, మెరుగుపడలేదు. నా కాశ్చర్యం కలిగి 'గురూ! నీ చొరవంతా ఏమైపోయింద'ని అడిగాను. దాని కతను 'ఆతేరా రథికుండు అంటూ మనం శ్రీకృష్ణనిర్యాణంలో చదువుకున్నాం గుర్తులేదూ అర్జును డంతటివాడు అసాధారణ పరిస్థితుల్లో భామిని భంగి ఏం చెయ్యలేకపోయాడుట. అల్లాగే ప్రేమ కలగని సాధారణ పరిస్థితుల్లో చెయ్యగలిన పనులు ప్రేమకలిగిన అసాధారణ పరిస్థితుల్లో చెయ్యలేదు. నేను సావిత్రిని ప్రేమించటంచేత తను ఎదురు పడ్డప్పుడల్లా గుండెలు డబడబా కొట్టు కోవడం, గొంతుక కిళ్ళీలెక్కువ నమిలి నప్పుడులాగా డెక్కపట్టుకోడం జరుగు తోంది. ఇంక నేను వెళ్ళి ఆ అమ్మాయిని పలకరించేదెల్లా!' అని వాపోయాడు.

ఓ పక్షంరోజులు గడిచాక నరసింహారావుకి బంగారంలాంటి అవకాశం వచ్చింది. మసక చీకట్లు కమ్ముతున్నవేళ నేను, అతను బస్సుకోసం మా ఇన్‌స్టిట్యూట్ గేటుదగ్గర నిలబడ్డాం. అదేటైముకి మమ్మల్ని గుర్తుపట్టలేకపోడంచేత సావిత్రి వచ్చి మా దగ్గర నిలబడింది. నేను నరసింహారావు చెవుల్లో ఆ అవకాశం జారవిడుచుకోవద్దని పోరటం మొదలు పెట్టాను. నరసింహారావు ధైర్యం కూడ దీసుకుని 'నా పేరు నరసింహారావు ... మీ పేరు...' అంటూ సూటిగా పలకరించాడు. సావిత్రి 'మిమ్మల్ని కలుసుకోడానికి సంతోషంగా వుంద'ని అనలేదు, 'నాపేరు సావిత్రి' అని అనలేదు, 'హలో అల్లాగా' అని కూడా అనలేదు. ఇవేవి

# హాయ్! అన్నా!...


అనకపోగా 'నాపేరు మీ కెందుకు?' అన్నది. అది కుతూహలం కాదు కోపం. 'మీతో పరిచయం చేసుకుందామని అడిగాను. మీ పేరు చెప్పటానికేమన్న అభ్యంతరమా?' అని అడిగాడు నరసింహారావు. సావిత్రి తన కభ్యంతరమని టపీమని జవాబు చెప్పింది. ఇంతలో బస్సు రావటంతో ఆ సంభాషణ అంతటితో అంతమైంది.

కాని నరసింహారావు సావిత్రిని మౌనంగా ఆరాధించటం మానలేదు. మంచికుటుంబం లోంచి వచ్చిన ఆడపిల్లలు అనవసరంగా మొగపిల్లలకి చనువియ్యరని, కేవలం మంచి కుటుంబంలోంచి రావటంచేతే సావిత్రి తనతో పరిచయానికి మొగ్గు చూపించలేదని నరసింహారావు సరిపెట్టు కున్నాడు. దాంతో సావిత్రి చూపించిన నిర్లక్ష్యం కూడా సావిత్రి సుగుణాలలో ఒకటిగా జమైపోయింది. అయితే అచంచల మైన ప్రేమకలిగిన నరసింహారావు నెల రోజుల్లో సావిత్రిలో కొంతమార్పు తెచ్చా డనే అనుకోవాలి. ఆ సంఘటన జరిగిన తరువాత సావిత్రికి అతనిపట్ల కొంత కుతూహలం కలిగిందని ఒప్పుకోవాలి. మెస్సులో నరసింహారావు పక్కన కూర్చో వాల్సి వచ్చినప్పుడు మధ్యలో సావిత్రి వది లేసే కుర్చీలసంఖ్య రెండునుంచి ఒకటికే పడిపోయింది. లైబ్రెరీలో పుస్తకాల రాక్స్ మధ్య సందుల్లోంచి, చదువుతున్న జర్నల్స్ చాటునుంచి సావిత్రి నరసింహా రావుని గమనించటం నేను గమనించాను. ఇల్లా మరో సంవత్సరం జరిగివుంటే ఎల్లా వుండునో కాని నరసింహారావు తొందరపడ్డాడు. నరసింహారావు తొందర పాటు చూసి కంగారుపడి సావిత్రి హైస్కూలు అమ్మాయిలు చెయ్యాల్సిన పని చేసింది.

దసరా లొచ్చాయి. ఆ సందర్భంగా వో మూడువారాలు సెలవుపెట్టి, వర లక్ష్మితో కాస్త బీచులకి సినిమాలకి తిర గచ్చు కదా అని నేను విశాఖపట్నం వెళ్లాను. నేను వెళ్తుంటే రైలుదగ్గర 'నువ్వదృష్టవంతుడివి' అన్నాడు నరసింహా రావు. అందులో అసూయలేదు. తనకి కూడా అల్లాంటి అవకాశం వుంటే బాగుండునన్న కోరిక తప్పించి. ఇంటికి వెళ్లిన నేను నాపనేదో నేను చూసుకో కుండా నేను వరలక్ష్మితో గడుపు తున్న మధుర క్షణాల గురించి కవిత్వం పుట్టిపడుతూ నరసింహారావు కో వుత్తరం వ్రాసాను. అది చదువుకున్న నర సింహారావు తనేదో పోగొట్టుకుంటున్నాడన్న నిస్పృహతో, ఇంకెన్నిరోజులో అల్లా పోగొట్టుకుంటూ బడుద్దాయిలా వుండ కూడదన్న ఆవేశంతో తొందరపడ్డాడు.

నేను హాస్టల్‌కి తిరిగొచ్చేసరికి, మాసిన బట్టలతోను, కొబ్బరిపీచులాంటి జుటు తోను, పెరిగీ పెరగని వికృతమైన గడ్డం తోను చేతిలో సిగిరెట్టుతోను, మంచం మీద పడుక్కున్న నరసింహారావు సాక్షా త్కరించాడు. గదినిండా సిగిరెట్టుపీకలు. 'వీరప్రేమికుడి కొంపలా వుంచావేమిటి మన గది' అన్నాను కోపంగా. మామూ లుగా అయితే నవ్వుతూ ఏదో జవాబు చెప్పే నరసింహారావు నోరు విప్పలేదు. ఎన్ని ప్రశ్నలడిగినా నరసింహారావు జవాబు చెప్పలేదు. ఆఖరికి నరసింహారావు సాయంత్రం నాతో మెస్సుకి కూడా రాలేదు.

మెస్సులో చాలామంది నరసింహారావు విషయం ఎత్తారు. కొంతమంది 'పాపం! ఏమిటి? మీ నరసింహారావు అల్లా అయి పోయాడు!' అంటూ సానుభూతి చూపిం చారు. కొంతమంది 'నరసింహారావి మధ్య పెద్ద గ్రంథకర్త అయ్యాడండోయి' అని పలకరించారు. మరి కొంతమంది 'ఏమండీ! మీ నరసింహారావు మరీ నల్ల పూసైపోయాడు. ఎంత విరహమైతే మాత్రం మరీ ఇంత ఇదా!' అంటూ జోకు లేసారు. కాస్త వివరంగా మాట్లా డింది సుబ్బారావే! సుబ్బారావు నోట్లో నువ్వుగింజ నానదు. అతను నన్ను చూస్తూనే 'ఏమండీ శర్మగారూ! మీ నరసింహారావు పాపం సావిత్రి వెంట పడ్డా డుట. ఆవిడేమో నీ హృదయం నాకక్కా ర్లేదంటూ పొట్లంగట్టి ఇచ్చేసిందిట. అయినా ఆవిడల్లా ఇచ్చేస్తే సంతోషించా ల్సింది పోయి నరసింహారావు బెంగపెట్టు కుని మంచమెక్కడం ఘోరం.' అంటూ వార్త అందించేసాడు. నరసింహారావు సావిత్రిని ప్రేమించిన విషయం సుబ్బా రావుకి తెల్సిందంటే మరి హాస్టలంతా తెల్సిందన్నమాటేగా! అల్లా ఆలోచించి నరసింహారావుతో నా తరువాత ఎక్కువగా పరిచయం వున్న రామారావుని అసలు విషయం ఏమిటని అడిగాను. దానికతను 'నిజం ఎవరికీ తెలియదు శర్మా! అందరూ తలోలా ఊహాగానం చేస్తున్నారు. నర సింహారావు అవునని అనడు కాదని అనడు. అందరు చెప్పుకునే దేమిటంటే నరసింహారావు సావిత్రితో ఆ అమ్మాయిని తను ప్రేమిస్తున్నా నన్నాడనీ, ఆవిడేమో మళ్లీ అల్లా మాట్లాడితే మర్యాద దక్క



దన్నదనీను, ఆ అవమానం భరించలేక నరసింహారావు బయటికి రావటంలేదనీను. పోతే నిన్న మీ ప్రొఫెసర్‌గారు హాస్టలుకు వచ్చిన విషయం నాకే తెలుసు. ఇల్లా కనుక ఇతను రిసెర్చి మానేసి మజ్నూగా మారితే ఇంటికి పంపించేయాల్సి వస్తుందని ఆయన అన్నారని సుబ్బారావు అంటున్నాడు. అతను పొంచి విన్నా విని వుంటాడు.' అంటూ తనకి తెలిసిన విషయాలు చెప్పాడు.

మర్నాటి సాయంత్రం నరసింహారావు దగ్గర కెళ్ళిగా ఈ విషయం ఎత్తాను. 'ఎద్దు కేం తెలుసు అటుకుల రుచి అంటారే అల్లాగే నీ గొప్పతనం సావిత్రికి తెలియకపోవచ్చును. తెలియకపోడంచేత తను నిన్ను తిరస్కరించవచ్చు. అంత మాత్రాన నీ గొప్పతనం తరగదు. నీలాంటి స్పోర్ట్స్‌మన్ మన ఇంస్టిట్యూట్‌లో ఎంతమంది వున్నారు. వాళ్ళలో బి. యి. ఎమ్. ఇ. ఫస్టు క్లాసులో పాసయినవాళ్ళు ఎంతమంది! అందుకని బెంగపెట్టుకోవాల్సింది సావిత్రే గాని నువ్వుకాదు.' అంటూ కోప్పడ్డాను.

'అయితే నిజం నీకు కూడా తెలియదా శర్మా! మన ప్రొఫెసర్‌గారు నిన్ను పిలిచి వాళ లెక్చరివ్వలేదా?' అని అడిగాడు నరసింహారావు ఆశ్చర్యంగా.

'ఆయన నాతో ఏమీ చెప్పలేదే! ఇంతకూ నిజం ఏమిటి' అంటూ ఆశ్చర్యపోడం నావంతైంది.


'సావిత్రి నన్ను తను ప్రేమించటం లేదని తన నోటితో తను చెప్తే నిజమే కాబోలు అనుకుని సరిపెట్టుకుందును. మౌనం వహించటంతో అది సిగ్గనుకున్నాను. మౌనం అర్ధాంగీకారం అని మన తెలుగు మాస్టారు చెప్పింది గుడ్డిగా నమ్మాను' అంటూ నరసింహారావు ఆలోచనలో పడ్డాడు. ఆరోజుకింక అతన్ని పలకరించి లాభంలేదు. రేపు అతనే పూర్తి కథ చెప్తాడని ఊరుకున్నాను.

నేను మర్నాడు నిద్రలేచేసరికి నరసింహారావు స్నానంచేసి గడ్డం గీసుకుని గంజిపెట్టిన తెల్లబట్టలు వేసుకుని పండులా తయారయి మెస్సుకి వెళ్ళడానికి రెడీగా వున్నాడు. నేను కూడా లేచి గబగబా తయారయ్యాను. ఇద్దరం మెస్సుకెళ్ళాం. నరసింహారావు నవ్వుతూ అందర్నీ ఏమీ జరగనట్టు పలకరించాడు. అదే నరసింహారావులో గొప్పతనం. తన బాధని అందరికి పంచిపెట్టడు. తనలో ఎంత బాధ వున్నా తను నవ్వుతూ అందర్నీ నవ్వించగలడు. నాతో డిపార్టుమెంటుకు వచ్చి ప్రొఫెసర్‌గారిని చూడటానికి వెళ్ళాడు.

మళ్ళీ సాయంత్రం రూములోనే నాకు కనిపించాడు. 'ఏమిటి కథ ప్రొఫెసర్‌గారి దగ్గరకు వెళ్ళావ్ పొద్దున్నే?' అని అడిగాను.

'చెప్తాలే. అల్లా కాంటీన్ దగ్గరకెళ్ళి ఓ సిగిరెట్టుపెట్టె కొనుక్కుని అల్లా చాకలాళ్ళ చెరువుదాకవెళ్ళి కథలు చెప్పుకుందాం పద' అంటూ దారితీసాడు. కథ వినాలన్న వుత్సాహంతో అంతదూరం నడిచాను. అప్పటికే చాకలాళ్ళంతా ఇళ్ళకి వెళ్ళిపోయారు.

'ఇక్కడ నేను తప్ప గాడిదలేవీ లేవ్!'



అవి నవ్వాడు నరసింహారావు.

'ముందర కథ చెప్పు. గాడిదల సంగతి తరువాత మాట్లాడ్దాం' అని తొందర పెట్టాను.

'ఇంటికివెళ్లి పీకాబోయే ఆవిడతో నువ్వు సినిమాలకి బీచులకి చెట్టాపట్టా లేసుకుని చిలకా గోరింకలలాగా చెక్కేయడం గురించి నువ్వు రాసిన వుత్తరం చదివాక నా మనస్సుదోలా అయిపోయింది. నేనూ వున్నా నెందుకు అనిపించింది. పాతికేళ్లు వచ్చాయి. ఏ అమ్మాయితోను చెప్పుకోదగ్గ పరిచయం లేదు. విదేశాల్లో అయితే అబ్బాయిలకి పధ్నాలుగేళ్లొచ్చినప్పటినుంచి ఎంచక్కా అమ్మాయి స్నేహితులుంటారా! మనకి పాతికేళ్లొచ్చినా ఆడపిల్లలతో చెప్పుకోదగ్గ పరిచయాలుండవు. అందుకని మనకి నచ్చే అమ్మాయిని మనమే చూసుకుని పెళ్లిచేసుకునే అవకాశం చాలా తక్కువ. అల్లా అని పూర్వంలాగా పధ్నిమిదేళ్లు రాగానే ఏ పన్నెండు పద మూడేళ్ల పిల్లనో పెళ్లిచేసుకుని పండుగలకి పబ్బాలకి అత్తవారింటికి వెళ్తూ పెద్దలచాటు రొమాన్సు ఏడుస్తున్నామా అంటే అదీలేదు. నీలాంటి అదృష్టవంతులు, ఎక్కడోగాని వుండరు. అంటే మనం రెంటికి చెడ్డ రేవడుల వౌతున్నామన్నమాట. మనకి మిగిలిందేమిటి? వయస్సువచ్చికూడా, ముక్కూమొహం తెలి

## హాయి! అన్నా!...,

యని అమ్మాయి మెళ్లో తాళికట్టడం అని నరసింహారావు అంటే నాక్కోపం వచ్చింది. ఏమిటితని అభిప్రాయం పెద్ద వాళ్లు నిశ్చయించిన సంబంధాలు మంచివి కావనా?

'ప్రేమించి పెళ్లిచేసుకునే విదేశాల్లో పెళ్లిళ్లు సరిగ్గావుండి యేడుస్తే మరి అక్కడ పుచ్చుకునే విడాకుల మాటేమిటి? అక్కడున్నంత ఘోరంగా ఇక్కడ లేవు కదా! ఇక్కడ పెద్దలు చేసిన పెళ్లిళ్లు నిలబడిన మాత్రమైనా నిలబడటం లేదేం!'

'ఆపవోయ్! దేశభక్తి గీతాలు. కొందరికి వయస్సు పెరిగినా వ్యక్తిత్వం ఏర్పడదు. వాళ్లు అమ్మా నాన్నా చూసిన అమ్మాయిని చేసుకుని సుఖపడగలుగుతారు. మనదేశంలో చిన్నప్పటినుంచి నిర్ణయాలు తీసుకోగలగటం అంటే డెసిషన్ మేకింగ్ నేర్పరు. అందుకని మనదేశంలో వ్యక్తిత్వం ఎదగని బుచ్చిబాబులు బుల్లిపాపలే ఎక్కువ. ఒకవేళ ఎవరైనా పొరపాటున ఏ ఖర్మకొద్దో తమంతట తామే నిర్ణయాలు చేసుకోగల సమర్థత సంపాదిస్తే అది పెద్దలపట్ల గౌరవం లేకపోడంగా జమకట్టబడి అణిచివేయ బడుతుంది. అందుకనే పాతికేళ్లు వచ్చినా అమ్మా




నాన్నలదగ్గరనుంచి మనిఆర్డర్లు తెప్పించుకుంటూ పరీక్షలకెళ్తూ చిన్న అబ్బాయిలుగా చెలామణి అయ్యే వోటింగ్ హక్కుగల వయోజనులతో మనదేశం నిండిపోయింది, వీళ్లంతా ఉద్యోగాలలో చేరాక, నిర్ణయాలు చేయాల్సివస్తే ఏంచేస్తే ఏం కొంప మునుగుతుందో అన్నభయంతో ఆపని ఇతర్లకి వదిలెయ్యటం చేస్తూవుంటారు. కొన్నాళ్ళ కందులో నేర్పు సంపాదిస్తారు. ఆ నేర్పు ఫైళ్లరూపంలోను ఎర్రటేపు రూపంలోను దేశం అంతా విశ్వరూపం ధరించింది. మన ఇన్‌స్టిట్యూట్‌లోనే చూడు. ప్రతీయేడు ఇంటర్‌వ్యూలకొచ్చే కుర్రాళ్లని సీటొస్తే చేర్తావా? అని అడిగిచూడు. మా నాన్న నడిగిచెప్తానంటాడు. వాళ్లనానంటే చచ్చేంత గౌరవం వుండికాదు. రేపేదైనా బెడిసికొడ్తే నీవల్లే ఇల్లా అయిందని బ్లేమ్‌చెయ్యడానికి వీలుగా వుంటుందని. ఈసోది అంతా ఎందుకు చెప్తున్నాననుకుంటావేమో. సావిత్రికూడా అల్లాంటి వాళ్ళలో ఒకత్తని చెప్పడానికి.'

'అంటే...సావిత్రి వాళ్ళ నాన్ననడిగి చెప్తానందా? అందే అనుకో నువ్వు చెప్పినట్టు ఆ అమ్మాయి వయస్సు పెరిగి వ్యక్తిత్వం ఎదగని మెజారిటీ గ్రూపులోకి వస్తుందని సరిపెట్టుకోక మరి ఈ పిచ్చివాడి వాలకం ఏమిటి?' అని అడిగాను. ఎదగని వ్యక్తిత్వం అంటూ నరసింహారావు అంటున్న మాటలు నిజానికి నాకు సూటిగా తగిలాయి. నేనూ ఆ కోవలో వాడినే. అందుకని నాకు కోపం వచ్చింది.


నరసింహారావు అర్థం అయినవాడిలా వో చిరునవ్వు నవ్వి, ఆపైన వో దమ్ము లాగి కథ అందుకున్నాడు. 'నాకు సావిత్రి రూపురేఖలు చదువు సంధ్యలు నచ్చాయి. సావిత్రి గురించి బాగా తెలుసుకుని ఇద్దరి మనస్తత్వాలు సరిపడితే తనని పెళ్లి చేసుకోవాలన్న అభిప్రాయం కలిగింది. ఈమధ్య నాపట్ల సావిత్రికికూడా ఏదో కుతూహలం కలిగిందన్న విషయం నువ్వూ మనించే వుంటావు. నాకిక్కడే సమస్యగ ఎదురైంది. ఆవిడ అభిప్రాయాలు తెల్సుకోడం ఎల్లా? మొగస్నేహితులు కలిగివుండటంమీద చిన్నచూపు కలిగిన మన సమాజంలో ఆడపిల్లలనవసరపు స్నేహా

ఇష్టపడరు. అందుకని అబ్బాయిల్తో చనువుగా వుండరు. కాని మామూలుగా ఏ అమ్మాయైనా తనకి ఫలానా అబ్బాయితో పెళ్లవుతుందని నిర్ధారణగా తెలిస్తే అతగాడితో స్నేహంగా వుంటుంది, నీతో వరలక్ష్మి వుంటున్నట్టు. నా ఇబ్బందేమిటంటే సావిత్రి ఎల్లాంటిదో తెలిస్తేగాని నేను పెళ్లి చేసుకుంటానని ఎలా అనగలనని'

'చక్కగా ప్రేమ వివాహాల సంఖ్య పెరిగితే ఆడపిల్లల తండ్రులకి కట్నాల బాధ వదిలిపోతుంది కదా!'

'ఇదింకో తమాషా శర్మా! ఆడపిల్లల తల్లిదండ్రులు ఆ అమ్మాయి సరియైన నిర్ణయం ఎక్కడ చేసుకోలేదో అని బోల్డన్ని కట్టుదిట్టాలుచేసి వెయ్యికళ్ళతో కనిపెడుతూ వుంటారు. కాని వాళ్ల అమ్మాయిని ఎవరైనా ఇష్టపడి కట్నం ప్రసక్తిలేకుండా పెళ్లిచేసుకోడానికి ముందరకి రాకపోతారా అని ఆశపడతారు. అల్లాంటి ఇష్టం ప్రేమెల్లా అవుతుంది? మోహం అవుతుందికాని. నీకు మరో అమ్మాయికి మధ్య చనువుంటేగాని ప్రేమ పుట్టదు. అవునా? కాని పెళ్లికి దారితీసే ప్రేమ అని నమ్మకంవుంటే తప్ప ఆ అమ్మాయి తల్లి దండ్రులు మీ ఇద్దర్నీ చనువుగా వుండనీరు. సావిత్రి హాస్టల్లో వుంటోంది కనుక ఈ బాధ లుండవనుకున్నా. అందుకనే వో పదిహేనురోజుల క్రితం లైబ్రెరీ దగ్గర వంటరిగా కనిపించిన సావిత్రితో 'మీరంటే నాకిష్టం మీతో స్నేహం చెయ్యాలని వుంది' అన్నా. ఆ మాటలు వింటూనే బెదిరిన లేడిలా అక్కడ్నుంచి సావిత్రి పరిగెత్తి పారిపోయింది. ఈ యేడు సావిత్రి కనుక రన్నింగ్ రేసులో పోటీచేస్తే నాకో కప్పు పోతుంది. ఆడపిల్లల్ని బెదరకొట్టకుండా మనస్సులో మాట చెప్పగలగటం వో పెద్ద నేర్పనుకుంటాను. అది నాకు లేదు. పైగా నేను కుర్రాడిగా వున్న రోజుల్లో చేసిన అల్లరికి నగిషి పెట్టి రమ ఉమ సావిత్రికి చెప్పివుంటారు. ఆరోజుల్లో ఆడపిల్లల్తో స్నేహం చెయ్యాలనే ఉబలాటం వుంది. చేసేందుకు వీల్లేని పరిస్థితులవల్ల, ఆడపిల్లల్ని ఆకర్షించేందుకు అన్న మాటలు, చేసిన చేష్టలు అల్లరిలోకి వచ్చేమాట నిజమే!' అంటూ నరసింహారావు ఆలోచనలో పడ్డాడు.

నరసింహారావు చిలిపి అల్లరి నాకు బాగా గుర్తుంది. అతని అల్లరితో అతను ఎవర్నీ బాధపెట్టేవాడు కాదు. అల్లాంటి వాటిలో నాకో సంఘటన బాగా గుర్తుంది. వోరోజు రమ తలంటిపోసుకుని కొత్త బట్టలు కట్టుకుని యూనివర్సిటీకి వచ్చింది. నరసింహారావు, రమని చూస్తూనే 'ఏమోయి! తలంటి పోసుకుని కొత్తబట్టలు కట్టుకున్నావ్! నీ పుట్టిన రోజా? ఏమన్నా తినిపిస్తావా? పోనీ ఏ సినిమాకి రమ్మంటావ్?' అంటూ విజృంభించాడు. ఆరోజుల్లో నేను బడుద్ధాయిలానే వున్నాను. అప్పటికింకా నా తలమీద నేనుంచుకోవాల్సిన జుట్టు పొడుగు మా నాన్నగారు, మాయింటికొచ్చే మంగలి మాత్రమే నిర్ణయిస్తున్నారు. అందుకని నరసింహారావెందుకు అల్లా అంటున్నాడో అర్థంకాక 'అదేమిటి నరసింహారావు! నా పుట్టినరోజా నెల క్రితమే వెళ్లిపోయిందిగా' అన్నాను ఆశ్చర్యంగా. ఇంతలో రమ, ఉమని కొట్టడం ఉమ మధ్య నన్నెందుకు కొడ్తావ్ అని రమని అడగటం దానికి రమ 'ఏదో తినడానికి కావాలన్నావు కదా! అల్లరివాళ్ళకి పెట్టేవివే' అనటం ఆపైన ఉమ రమ నవ్వటం జరిగాయి. అప్పుడు రమకేసి



FDSAS-1809 TE

# హాయిగా అన్నా!...

చూసిన నేను నరసింహారావు ఆ మాటలు నన్ను వుద్దేశించి అనలేదని గుర్తించాను. నాకు వరలక్ష్మితో పరిచయం అయినకొద్దీ ఆడపిల్లల మనస్సు బాగా అర్థమవటం మొదలుపెట్టింది. రమకి ఎక్కడో నరసింహారావంటే ఇష్టం వుందని, నరసింహారావు అల్లరివాడని ప్రచారం చెయ్యటం కేవలం మిగిలిన ఆడపిల్లల్ని బెదరగొట్టి పోటీ లేకుండా చేసుకోడం కోసమేనని నా అభిప్రాయం. ఈ అభిప్రాయంతో నరసింహారావు ఏకీభవించడు. పైగా అందువల్లే సావిత్రికి తనంటే సదభిప్రాయం లేదంటాడు.

'నేను సావిత్రితో స్నేహం చెయ్యటోడంలో నాకే చెడు ఊహలు లేవని సావిత్రితో చెప్పదల్చుకున్నాను. అందుకని, తను మర్నాడు కనిపించినప్పుడు 'నేను మిమ్మల్ని పెళ్లిచేసుకుందామనుకుంటున్నా' అన్నాను అల్లా అంటే అయినా మాట్లాడుతుందేమో ననుకున్నాను. కాని సావిత్రి మౌనం వహించింది. ఆ మౌనాన్ని తప్పుగా అర్థం చేసుకుని 'పోనీ ఆలోచించి రేపు చెప్పండి' అన్నాను. ఆ తరువాతి రెండ్రోజులు సావిత్రి చెలికత్తెలు లేకుండా ఒంటరిగా కనిపించలేదు. అందుకని మూడోరోజున నేనే హాస్టల్‌కి వెళ్లి సావిత్రికోసం కబురు చేశాను. సావిత్రి లేదని కబురొచ్చింది. సావిత్రి హాస్టల్లో వుందని నాకు తెల్సు. సావిత్రి ఉండీ లేనని చెప్పించటం నాకు చాలా అవమానకరంగా అనిపించింది. తనకి నేనంటే ఇష్టంలేకపోతే ఆ మాటే చెప్పొచ్చుకదా! వీడి మొహం వీడికి నోటితోనే జవాబు చెప్పాలా అనుకున్నట్టుంది. లేక నేనంటే చాలా భయపడి వుండాలి. ఇదే నిజం అనుకుంటా ఎదురుపడితే ఏం చేస్తానో, అసలే రౌడీని కదా, అని భయపడి వుంటుంది. ఆ భయంతోనే వాళ్ల ప్రొఫెసర్‌కి చెప్పుంటుంది.'

సావిత్రి వాళ్ల ప్రొఫెసర్‌తో చెప్పిందా? ఏమని చెప్పుంటుంది. ఏదో చెడుగానే చెప్పుంటుంది. కొత్తగా వోణీ లేసుకునే హైస్కూలమ్మాయిలు, పెళ్లి గురించి, సెక్స్ గురించి తెలిసీ తెలియని వయస్సు వాళ్లు మొదటిసారి ప్రేమలేఖ అందుకున్నప్పుడు కంగారుపడి హెడ్మాష్టర్‌కి రిపోర్ట్ చేసినట్టు వాళ్ల ప్రొఫెసర్‌కి చెప్పిందా! అని చాలా ఆశ్చర్యపోయాను. తేరుకున్నాక 'ఏమని చెప్పింది?' అని అడిగాను.

'సావిత్రి వెళ్లి వాళ్ల ప్రొఫెసర్‌తో 'నరసింహారావనే రిసెర్చిస్కాలర్ నావెంట పడుతున్నాడు ప్రేమాగీమా అంటూ! అతన్ది సివిలింజినీరింగ్ అని రమ చెప్పింది' అంటూ చెప్పిందిట. ఆయన ముప్ఫైయేళ్ళ సర్వీసులో ఇదే మొదటి ప్రేమ కేసుట. అందుకని ఈ ఛాన్సు పోనీరాదని అనుకుని మన ప్రొఫెసర్‌గారిని ఫోనులో పిలిచి 'మీ డిపార్టుమెంటులో వుంటున్న నరసింహారావనే జులాయి బాలుడు మా డిపార్టుమెంటులో వుంటున్న ముగ్ధబాలిక సావిత్రి వెంట పడుతున్నాడు. గట్టిగా మందలించాల్సింది. మరోసారిలా జరిగితే మాట దక్కదు.' అంటూ మన ప్రొఫెసర్ గారు చెప్తున్నది వినిపించుకోకుండా ఫోను పెట్టేసాడుట. మన ప్రొఫెసర్‌గారికి దక్కనిది నామాటో తనదో తెలియక తనదే అన్న నిర్ణయానికొచ్చి నరసింహారావు అంటూ వుండబట్టేకదా నాకిల్లాంటి అనుమానాలు అవమానాలు కలుగుతున్నాయి అని కోపం తెచ్చుకుని; నన్ను పిలిచి సినలైన సాంఘిక చిత్రంలోలాగా 'నువ్వీ ఇంస్టిట్యూట్‌లో జేరింది రిసెర్చి చెయ్యటానికా? ప్రేమించటానికా! నువ్వు అమాయకురాలైన సావిత్రిని అల్లరి పెడతావా? హాయి! అన్నా! ప్రేమిస్తావా నువ్వా అమ్మాయిని?' అంటూ దులిపేసాడు. నాతత్వం తెల్సుకదా!

'ఎందుకు ప్రేమించకూడదు సార్?' అని ఎదురు ప్రశ్నించాను.


'నువ్వు ఇంస్టిట్యూట్‌లో జేరింది రిసెర్చి వెలగబెట్టడానికి కనుక ప్రేమ వెలిగిస్తే రిసెర్చి వెలగదు కనుక' అన్నాడాయన.

'అదేమిటి సార్!...ఆయనకి సార్ అనకపోతే కోపం వస్తుంది తెల్సు కదా!... ప్రేమించినవాళ్లు రిసెర్చి చెయ్యలేరా! లేక రిసెర్చి చేసేవాళ్లు ప్రేమించలేరా?' అన్నాను.

'ఎల్లా చేస్తారేం?' అని నిలదీసాడు ఆయన.

'అదేమిటి సార్! మీరు పెళ్లాంతో కాపురం చేస్తూ, మీ పిల్లల జలుబులో బాధపడుతూ రిసెర్చి చెయ్యడం లేదా సార్!' అని అడిగాను. నిజానికి ఆయన చెయ్యటంలేదు. కాని ఆమాట ఆయన పబ్లిక్‌గా ఒప్పుకోలేడు కదా. అందుకని ఆయన ప్లేటు మార్చి

'గౌరవమైన కుటుంబంలో నుంచి వచ్చిన సావిత్రిని ప్రేమించానడం ఏమన్నా బాగుందా!' అని అనునయంగా అడిగాడు.



'గౌరవమైన పిల్లని ప్రేమించకపోతే అలగా వాళ్లని ప్రేమిస్తామా సార్! ఇంక పోతే గౌరవమైన కుటుంబంలోంచి వచ్చిన అమ్మాయి ప్రేమించబడటానికి అనర్హురాలు అని మీరంటే అది వేరే విషయం' అని సవినయంగా సమాధానం చెప్పాను.

'ఎవరైనా - నీ చెల్లెళ్లతో ఇదేమాట

అంటే?' ఆయన పాతపాట అందుకున్నాడు.

'ఇతర్లచేత ప్రేమించబడటానికి కావల్సిన సుగుణాలేవో మా చెల్లెళ్ళలో వున్నాయి కదా అని గర్విస్తాను సార్!' అన్నాను.

'ఏ అడ్డమైనవాడో ప్రేమించినా కూడానా?' అని అడిగాడు. అప్పటికే ఆయన మొహం ఎర్రబడింది. ఆయన కోపం చెల్లెలు గౌరవం కాపాడటం విషయంలో పి. యు. సి. కుర్రాడికొచ్చే కోపంలా వుంది.

'ప్రేమించ బడటంలో ప్రేమించిన వాడి అడ్డం, నిలువుల ప్రసక్తి లేదు సార్! తిరిగి ప్రేమించడానికేగాని. ఎంత నల్లటి అబ్బాయైన తెల్లటి పెళ్ళాం కావాలని అనుకోడంలో తప్పులేదు. ఆ నల్లటబ్బాయిని పెళ్ళిచేసుకోడం చేసుకోకపోడం ఆ అమ్మాయి ఇష్టం. అట్లాగే ఆ ప్రేమించినవాడు అడ్డమైన వాడైతే మా చెల్లెలే 'క్షమించండి నాకు వేరే వున్నారని చెప్పి తప్పించుకుంటుంది' అన్నాను. ఆ క్షణంలో మన ప్రొఫెసర్‌గారు సలుపని ఆయన భార్య తెలుపని మర్చిపోతూను.

'మీ చెల్లెలికి స్వయంగా నిర్ణయాలు తీసుకోగలిగిన శక్తి లేకపోతే?' అన్నారు ప్రొఫెసర్‌గారు.

'నన్నడగచ్చు కదా సార్' అన్నాను.

'సావిత్రి కల్లాంటి శక్తి లేకే వాళ్ల ప్రొఫెసర్నడిగిందనుకుందాం' అన్నాడు. ఆయనమొహంలో విజయగర్వంకనిపించింది.

'సావిత్రి కనుక ఆయన్ని అల్లాగే అడిగుంటె ఆయన 'ఇదిగో సావిత్రి నరసింహారావు నిన్ను ప్రేమించాడు గాని నన్ను ప్రేమించలేదు. ఇష్టం వుంటే తిరిగి ప్రేమించు. లేకపోతే మానెయ్యి. పోతే నరసింహారావు ఎల్లాంటి వాడని అడుగుతావా? నాకేం తెలుసు తెలిసిన వాళ్ళనడుగు. లేక సివిలింజనీరింగ్‌లో పి. హెచ్. డి. చేసిన వాళ్ళకి ఉద్యోగాలు వస్తాయా అని అడుగుతుంటే వాళ్ల ప్రొఫెసర్నిడిగి చెప్తాను' అని ఆయన అని వుండాల్సింది. అంతేకాని మాటదక్కుదు అంటూ ఫోను చెయ్యటం చూస్తుంటే సావిత్రితోపాటు ఆయనకి కూడా సరిగ్గా ఆలోచించటం రాదనిపిస్తోంది' అన్నాను. నా ఆర్గ్యుమెంటు కొంచెం పొడిగిస్తే 'ఆయన ఫోను చేసినంతమాత్రాన మీరు నన్ను నిలదీయటం చూస్తుంటే మీకూ ఆలోచించటం రాదని అనుకోవాల్సి వస్తుందన్న' భావం పి మాత్రం తెలివైన వాడికైనా తడుతుంది. మన ప్రొఫెసర్‌గారి కామాత్రం తెలివి తేటలున్నాయి. దాంతో ఆయనకి కోపం వచ్చింది. అదునుకోసం ఆగిపోయాడు.

ఒక వారం రోజులపాటు ఆ సావిత్రి విషయం వాళ్ల ప్రొఫెసర్ విషయం సమాధిలో కూర్చుని ఆలోచించాను. ఆ యేడో రోజు సాయంత్రం జ్ఞానోదయం కలగలేదు గాని, మర్నాటి నుంచి యధాప్రకారం డిపార్టుమెంటుకి రాకపోతే మరి రావలసిన అవుసరం లేదని మన ప్రొఫెసర్‌గారు మన రూమ్‌కొచ్చి చెప్పి వెళ్ళారు. అందుకని ఈ సత్యానందస్వామి కొన్నాళ్ళు మన వూరు వెళ్ళి శాంతి ఆశ్రమంలో విశ్రాంతి పుచ్చుకుంటారు' అంటూ నరసింహారావు కథ ముగించాడు.

'మధ్యలో ఈ సత్యానందస్వామి గొడవ ఏమిటి?' అని అడిగాను. ఆశ్రమానిక్కదా వెళ్ళేది అని స్వామి పెట్టుకున్నాను. సావిత్రి జీవితంలో సత్యవంతుడిని ఎల్లాగూ కాలేక పోయానుకదా అని సత్యానామధేయం స్వీకరించాను. ఈ ఇంస్టిట్యూట్ పీడ ఇంతటితో వదిలిందికదా అని ఆనంద పడుతూ ఆనంద అన్న ముక్క తగిలించాను' అంటూ నరసింహారావు అన్నింటికి తేలికగా సమాధానం చెప్పే తన మామూలు ధోరణిలో సమాధానం చెప్పి మర్నాడు విశాఖపట్నానికి రైలెక్కాడు.

నా అనుమానం సావిత్రికి తనవెంట ఫలానావాడు పడ్డాడని అందరికీ తెలియడంలో గర్వం, ఆనందం తను అల్లాటప్పా మనిషి కాదని అందరూ గుర్తించాలన్న తపన వున్నాయని. కాని సావిత్రి తనకి వచ్చినలాంటి అవకాశం అందరికీ రాదని గుర్తించలేని మూర్ఖత్వం గుర్తించినా స్వయంగా నిర్ణయం తీసుకోలేని బలహీన వ్యక్తిత్వంకూడా వున్నాయి వానితోపాటు. సావిత్రిలాంటి అమ్మాయిని ప్రేమించడమే నరసింహారావు చేసిన పొరపాటు. చేసిన పొరపాటుకి ఫలిత మనుభవించక తప్పదు కదా! అందుకనే శాంతి ఆశ్రమానికి వెళ్దామనుకున్న నరసింహారావు పిచ్చాసుపత్రికి వెళ్ళాడు. ●

